IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# జ్ఞానపీఠ్ పురస్కార నవలలు – విశ్లేషణ

తుళ్ళూరు రవి,
పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం,

మనదేశంలో ఆంగ్లేయులపాలన తర్వాత భారతీయ సామాజికజీవన విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రయాణసౌకర్యాలు పెరగడం, అచ్చుయంత్రాలు, వార్తాపత్రికలు, ఆంగ్లపాఠశాలలు పుట్టుకురావడంతో ప్రజలలో చైతన్యం ఏర్పడింది. అందరికీ ఒకేరకమైన చదువు, ప్రజాస్వామ్యవ్యవస్థ, పేదరిక నిర్మూలనకై తీసుకున్న ప్రభుత్వ చర్యలు, పాలనాసంబంధ అవగాహన పెంపొందటం వీటివల్ల ప్రజల్లో వివేచనాగుణం పెరిగింది. సాహిత్యరంగంలో ఆంగ్లసాహిత్య ప్రభావంవల్ల భారతీయ సాహిత్యంలో తెలుగు సాహిత్యంలోను మార్పులు వచ్చాయి. ముఖ్యంగా వచనసాహిత్య ప్రక్రియలు అభివృద్ధి చెందాయి. వస్తు స్వీకరణలోను, ప్రక్రియా నిర్ణయంలోనూ, భాషను వినియోగించు తీరులోనూ, రచనాశైలిలోనూ వైవిధ్యం కనపడుతుంది. సమాజవ్యవస్థలో భిన్నమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఇలా అభివృద్ధి చెందిన వచనసాహిత్య ప్రక్రియలలో నవల నేడు ప్రజల ఆదరాభిమానాలను ఎక్కువగా పొందుతున్న ప్రక్రియ. తెలుగు వచనసాహిత్యానికి వ్యాప్తిని కలిగించిన తొలితరం ప్రక్రియల్లో నవల ఒకటి. “నావెల్” అన్న ఆంగ్ల పదమే ధ్వనిమార్పులు పొంది తెలుగులో నవలగా పరిణమించింది. నవల అన్న పదాన్ని కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి 1897లో రాజశేఖర చరిత్రమును విమర్శిస్తూ రాసిన వివేకచంద్రికా విమర్శనము అన్న వ్యాసంలో తొలిసారిగా ప్రస్తావించారు. “నవల సమకాలీన జీవిత వాస్తవికత మీద ఆధారపడ్డ కల్పనాత్మక వచన సాహిత్య ప్రక్రియ. ఇది సాధారణంగా కథాత్మకమైనది. ఇందులోని సంఘటనలు, పాత్రలు వాస్తవ జీవితానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. దీని నిడివి కథాప్రయోజనాన్నిబట్టి దాదాపు వంద పుటలనుంచి ఎంతైనా ఉండవచ్చు” (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 13).

వచనసాహిత్య ప్రక్రియలన్నింటిలో నవలకు విశిష్టస్థానం ఉంది. వ్యక్తిగత అంశమైనా, వ్యవస్థాగత అంశమైనా సమకాలీనదృష్టితో సకారణంగా, వీలైనంత సంపూర్ణంగా చిత్రించగల సామర్థ్యం ఆధునిక సాహిత్య ప్రక్రియలలో ఒక్క నవలకే ఉంది. ఈ కారణంంగానే నవలను జీవితానికి ప్రతిబింబం అంటుంటారు. “ఒక దేశఆత్మను గుర్తించడానికి ఆ దేశసాహిత్యాన్ని ముందుగా అర్థం చేసుకోవాలి” అంటారు మాలతీచందూర్. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ఆధునికయుగంలో నవల నిలుస్తుంది. భారతదేశంలో నవల సాహిత్యపరిణామంలో భాగంగా మొదలైంది అనేదానికంటే సామాజిక అవసరంగానే భావించాలి. తొలితరం భారతీయ నవలలైన కపాలకుండల(బెంగాలీ), ఆనందమఠం(బెంగాలీ), ఇందులేఖ(మళయాళం), ప్రతాపమొదలియారు చరిత్ర (తమిళం), రాజశేఖర చరిత్రము (తెలుగు) మొదలైన నవలలు సామాజిక అంశాలకే ప్రాధాన్యత ఇవ్వడం ఇందుకు నిదర్శనం. సాహిత్యాన్ని సామాన్య ప్రజలకు దగ్గర చేసిన నవల గొప్పతనాన్ని గుర్తిస్తూ ఉత్తమ నవలలకు

పురస్కారాలను ఇచ్చే సంప్రదాయం భారతదేశంలో మొదలైంది. తెలుగులో మొట్టమొదటగా చింతామణి పత్రిక నవలలకు పురస్కారం లభించింది. ఈ పురస్కారం నవలా రచయితలకు ప్రేరణ అయిందని చెప్పవచ్చు. అప్పటివరకు వ్యాపార నవలల పేరుతో నాసిరకం సాహిత్యం వెలువరిస్తున్న రచయితలు ప్రత్యేక విలువను సంతరించుకున్న సాహిత్య ప్రక్రియగా నవలను గుర్తించి వస్తుగతంగా విశిష్టతను సాధించేలా మార్పు చేసి రచించసాగారు. తద్వారా ఆయా భాషలలో ఉత్తమసాహిత్య సృష్టికి దోహదం కలిగింది.

స్వాతంత్ర్యానంతరం జాతీయ స్థాయిలో అందించే పురస్కారాలలో ముందుగా చెప్పుకోదగింది జ్ఞానపీఠ పురస్కారం. జాతీయస్థాయిలో అందించే సాహిత్యపురస్కారాలు ఆయా భాషల్లోని ఉత్తమ రచయితలను, రచనలను గుర్తించి దేశానికి పరిచయం చేశాయి. భారతదేశంవంటి బహుభాషాదేశంలో సమాజచైతన్యానికి ఈ రకమైన రచనా విధానం ఆవశ్యకం. ఒకరి రచనకు పురస్కారం దక్కడం అంటే సాహిత్యం మొత్తానికి దక్కడం అనే అర్థం ఉంది. అయితే రచయితను, పాఠకుణ్ణి, న్యాయనిర్ణేతలను ముందుగా ఆకర్షించేది, ఉత్తమ సాహిత్యాన్ని గుర్తించడానికి తొలి ప్రమాణంగా నిలిచేది వస్తువు. జ్ఞానపీఠ పురస్కారం పొందిన నవల్లో వస్తుపరంగా, సామాజికంగా అనేక విషయాలు సమాజానికి చెప్పినటువంటి విషయాలను పురస్కారం పొందిన నవల్లో దర్శించవచ్చు.

**చిత్రసుందరి:**

ఈ నవల మహిళాచైతన్యానికి సంకేతం. ఆనంది ఇందులోని ప్రధానపాత్ర. అణ్ణామలై చిత్రకారుడు. పరస్పరం ఆకర్షితులవుతారు. అది ప్రేమగా మారుతుంది. ఇలా ఉండగా అణ్ణామలై తండ్రి ఆశ్రయం పొందిన మాణిక్యం దృష్టి ఆనందిపై పడుతుంది. అనుకోకుండా కొన్ని సంఘటనల ప్రభావంతో ఆనంది వివాహం మాణిక్యంతో జరుగుతుంది. అతనిలోని దుర్మార్గం, ధనదాహం, వంచన ఆనంది జీవితాన్ని నరకప్రాయం చేశాయి. దీంతో అణ్ణామలై తీరని వ్యథకు లోనవుతాడు. అతనికి తండ్రి స్నేహితుని కుమార్తె సుందరితో పెళ్ళి జరుగుతుంది. సుందరికి ధనాశ అధికం. శృంగార చిత్రాలు గీసి డబ్బు సంపాదించాలని భర్తను వేధిస్తుంది. వీరి మధ్య అంతరం పెరుగుతుంది. చివరకు ఆత్మహత్య చేసుకుంటుంది. అణ్ణామలై తండ్రి మంచం పట్టి కన్ను మూయడం. మాణిక్యంతో జరిగిన ఘర్షణలో ఆనంది మంగళసూత్రం తెగిపోతుంది. ఆనంది శాశ్వతంగా అణ్ణామలైతో జీవితం గడపడానికి వెళ్ళిపోతుంది. ఈ నవల సమాజంలో అనూహ్య స్పందన కలిగించింది. శాస్త్రం ప్రకారం పెళ్ళి చేసుకున్నంత మాత్రాన భర్తలు భార్యలను బానిసలుగా చూసే కాలం గతించింది అని అఖిలన్ హెచ్చరించాడు. సన్నివేశకల్పన, పాత్రచిత్రణ, కథన విన్యాసంలో ఈ నవల కొత్త పుంతలు తొక్కింది.

**యయాతి:**

యయాతి నవల మరాఠీ నవల దీని మూల రచయిత విష్ణు సఖారామ్ ఖండేకర్, ఈ నవలకు 1974 సంవత్సరంలో భారతీయ జ్ఞానపీఠ పురస్కారం దక్కింది. దీన్ని తెలుగులోకి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అనువాదం చేశారు. యయాతి' నవలలోని వస్తువు పౌరాణికమైంది. వస్తువు, పాత్రలు పౌరాణికాలైనా ఖాండేకర్ వాటిని ఆధునిక సమాజానికి వర్తింపజేస్తూ అద్భుత ప్రతీకలుగా మలిచారు. ఇది ఒక సందేశాత్మక రచన. ఆధునిక సమాజంలో మితిమీరుతున్న భోగలాలసతను దుయ్యబట్టారు. ధనార్తిని, విధ్వంసక ప్రవృత్తిని, బలప్రదర్శనను రచనల్లో నిరసించారు. కామమోహాల కంటే త్యాగమే గొప్పదని నిరూపించారు. ఇందుకు "కచ-దేవయాని" వృత్తాంతంలో మార్పులు చేశారు. కచుని పాత్ర ఆదర్శప్రాయంగా ఉండేటట్లు తీర్చిదిద్దారు. సమాజంపట్ల వ్యక్తి బాధ్యతల్ని ఈ నవల గుర్తు చేస్తుంది. భారతీయ సాంస్కృతిక, తాత్విక విలువలకు ఈ నవల పెద్దపీట వేసింది.

యయాతి, శర్మిష్ఠ, కచుడు, దేవయాని పాత్రలకు ఆధునికాన్వయం చేకూర్చడంలో ఖండేకర్ చూపిన ప్రతిభ అసాధారణం. సమకాలీన సామాజిక జీవితానికి అద్దం పడుతుంది.

**జీవితం ఒక నాటక రంగం:**

మానవీనీ భవాయీ అన్న గుజరాతీ నవలను పన్నాలాల్ పటేల్ 1947లో రచించగా దానికి 1985లో జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది. ఇందులోని ఇతివృత్తం అంతా 1947 నాటి సంధి కాలానికి సంబంధించింది. ఈ నవల పూర్తిగా గ్రామీణ జీవితం నేపథ్యంగా రచించబడింది. ఈ నవలకు ఇందులో సమకాలీన సమాజంలోని సాంఘిక స్థితిగతులు, వాతావరణ వైపరీత్యాలు రైతు జీవితంపై ఎటువంటి ప్రభావం చూపాయనేది ప్రధానవస్తువు.ఆనాటి సంధికాలానికి ముడిపెట్టి పన్నాలాల్ పటేల్ నవలను ప్రతిభావంతంగా రచించారు. ఈ విశిష్టమైన నవలను నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా వారు భారతదేశంలోని పలు భాషల్లోకి అనువాదాలు చేయించి ప్రచురించారు. ఆ క్రమంలో 1971లో అంతరభారతీయ గ్రంథమాల పథకం కింద ఈ నవలను జీవితం ఒక నాటక రంగం పేరిట తెలుగులోకి అనువాదించి వేమూరి ఆంజనేయశర్మ ప్రకటించారు. ఈ అనువాదం 1990లో ద్వితీయ ముద్రణకూడా పొందింది.

**ఒకతల్లి:**

నవల కథాకాలం అంతా ఒక సంవత్సరంలో జరుగుతుంది. సుజాత చిన్న కొడుకు గుర్తు చేసుకుంటూ పురిటినాటి జ్ఞాపకాలతో మొదలై, కొడుకు చనిపోవడానికి గల కారణాలను వెతుక్కుంటూ సంవత్సరం అంతా తిరిగి తిరిగి, అలసి ఇంటికి వచ్చిన సుజాత ప్రాణాలు విడుస్తుంది. మానవహక్కులు కోసం పోరాడే యువశక్తిని మేల్కొపే నవల ఇది. తల్లికి తన కొడుకు చనిపోతే పడే బాధను సుజాత పాత్రతో మహాశ్వేతాదేవి ఈ నవల్లో చూయించారు. సామాజిక జీవితానికి ఈ నవల ఒక మలుపుగా కన్పిస్తుంది.

**సంస్కారం:**

యు.ఆర్.ఆనంతమూర్తి సంస్కారం చుట్టూ అల్లుకున్న సమాజాన్ని మర్చాలనే దృష్టితో రాశారు. సుజాత పట్వారి కన్నడం నుండి తెలుగులోకి అనువాదం చేశారు. ఈ నవలకు 1994లో జ్ఞానపీఠ పురస్కారం దక్కింది. దుర్వాసపురం అగ్రహారం నారాయణప్పతో కథ మొదలై అనేక సంఘటనలతో బ్రాహ్మణ వ్యవస్థలో ఉన్నటువంటి మూఢనమ్మకాలు వంటి వాటిని పరిహరించి, సమ సమాజాన్ని చైతన్యపరిచే నవల. సమాజానికి సమాధానం చూపేట్టే విధంగా ఉంటుంది.

**పాకుడురాళ్ళు:**

పాకుడురాళ్ళు నవలను రాయడానికి రావూరి భరద్వాజకు ఆయన సినీ జర్నలిస్టుగా పనిచేసిన అనుభవం తోడ్పడింది. సినిమారంగంలో ఉన్న పురుషాధిపత్యం, స్త్రీలను తమ అవసరాలకు వాడుకొని వదిలేయడం వంటివి పాకుడురాళ్ళు నవలలో కన్పిస్తాయి.

మంజరి జీవితంలో పుట్టుక, ఎదుగుదల, నేర్చిన బతుకు చదువుతో పాటు రాజకీయ, ఆర్థికంగా సామాజిక సాంస్కృతిక రంగాల్లో తన కాలంలో సంఘర్షణలు, స్థితిగతుల అవగాహనతో మంజరి పాత్ర సాగే విధానం, సమయానికి అనుకూలంగా మలుచుకోవడం, జీవన విధానం సినిమా రంగంలో ప్రవేశించాక పూర్తిగా మారిపోవడం కన్పిస్తుంది. సినిమా నిర్మాణం, నటనకు సంబంధించిన అంశాలు ఈ నవలలో తక్కువ. ఎక్కువగా

మనిషిలోని నైతిక విలువల పతనం, నాగరిక సమాజంలో కనిపించే అనేక అంశాలు ఈ నవలలోని వస్తువుకు ఆధారభూతమైన అంశాలు. కర్పూరంలా వెలిగి ఆరిపోయిన మంజరి జీవితంలోని విషాదాలన్నింటికీ సినిమా వ్యవస్థలోని లోపాలు ఒక కారణం అయితే, మంజరి స్వీయ వ్యక్తిత్వం రెండవ కారణంగా కన్పిస్తుంది.

సాహిత్య పురస్కాలను ప్రవేశపెట్టడం సాహిత్యానికి, సంస్కృతికి, కవులకు, రచయితలకు, దేశానికి గొప్ప సేవ చేసిన వారికి గుర్తుగా అనేక రకాల పేర్లతో పురస్కారాలు అందిస్తున్నారు. దేశంలోని భాషకి వివిధ ఆచారాలను పెంపొందించడానికి జ్ఞానపీఠ పురస్కారం దేశసౌభాగ్యానికి గర్వకారణం.

**ఆధారగ్రంథాలు:**


1. ఆనందరామం, సి. 1979. ***తెలుగు నవలల్లో కుటుంబ జీవన చిత్రణ***. విజయవాడ: నవజ్యోతి పబ్లికేషన్స్.

2. కుటుంబరాయశర్మ, బొడ్డుపాటి. 1971. ***ఆంధ్ర నవలా పరిణామము***. హైదరాబాదు: గాయత్రీ ప్రచురణము.

3. నాగభూషణశర్మ, మొదలి. 1971. ***తెలుగు నవలా వికాసం***. హైదరాబాదు: శ్రీమతి పద్మజాభూషణ్.

4. భవాని, పి. 2004. ***తెలుగు సాంఘిక నవలలు – వాస్తవికత(1900–1950)***. హైదరాబాదు: ఈస్ట్ వెస్ట్ రీసెర్చ్ సెంటర్.

5. మృణాళిని,సి. 1988. ***సాంఘికనవల – కథనశిల్పం***. హైదరాబాదు: తెలుగుపరిశోధన ప్రచురణలు.

6. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994. ***నవలా శిల్పం***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

7. వెంకటేశ్వరరావు, పుల్లాభొట్ల.1974. ***తెలుగు నవలా సాహిత్య వికాసము***. విజయవాడ.